"ఫర్వాలేదులే"

ఇద్దరూ చెట్టుక్రింద కూర్చున్నారు. కొద్దిగా చీకటి పడింది.

"ఈరోజు మీ పత్రికాఫీసుకి వెళ్ళాను" అన్నాడు రాజు.

ఆమె ఆశ్చర్యంగా "ఎందుకు?" అని అడిగింది.

"మా క్లినిక్ ప్రకటన ఇవ్వటం కోసం.. నీకో మంచి వార్త"

" ఏదీ? ఆ మైండ్ హిప్నో మాగ్నో క్లినిక్కేనా? అసలు ఒక్క పేషెంట్ అయినా వస్తాడంటావా?"

"వస్తారు"

"అంతకుముందు హిప్నాటిజం క్లినిక్ పెట్టినప్పుడూ అదే చెప్పావ్. అది మూతపడింది. ఇప్పుడు దాదాపు ఇదీ అలాంటిదే కదా. పోతే దానికి మరికొన్ని మిషన్లు కలిపావ్. గ్రహించలేరా?".

"ఈ రోజే అన్ని పేపర్లలో ప్రకటనలు ఇచ్చాంగా. చూస్తూ వుండు.. జనం ఎలా విరగబడతారో".

"ఏమో, నాకు నమ్మకం లేదు బాబూ".

"ఇంత మంచి వార్త చెపితే అలా డల్‌గా వుంటావేటి?"

"నీకో చెడ్డవార్త"

"ఏమిటి?"

"నా ఉద్యోగం పోయింది" అంటూ ఆమె జరిగినదంతా చెప్పింది.

అంతా విని, ప్రయివేటు ఉద్యోగాల్లో వున్నప్పుడు అందరితో కాస్త మంచిగా వుండాలి. అందరికన్నా ముందు నిన్ను తీసేశారంటే... అది నీ అసమర్ధతే. నన్ను చూడు. చేరిన కొద్ది నెలల్లోనే పార్టనర్‌షిప్ కూడా ఇచ్చేలా చేసుకున్నాను" అన్నాడు.

"నీలా బ్రతకనేర్వటం అందరికీ చేతకాదులే" అందామె నిర్లిప్తంగా. ఆ క్షణం అతడు తనని ఓదార్చకపోయినా, కనీసం ఒక ఉచిత సలహా ఇవ్వకుండా వుంటే బావుణ్ణు అనిపించింది.

"రేపట్నుంచి ఏం చేస్తావ్?"

"అదే అర్థం కావటంలేదు. ముఖ్యంగా అమ్మకు తెలుస్తే అసలు తట్టుకోలేదు ఉద్యోగం పోయిందని తెలియగానే. ఇక సంసారం వీధిన పడిపోయిందన్నంతగా ఊహించుకుని బాధపడుతుంది".

"చిన్న విషయాన్ని పెద్దది చేసుకుని, లేని ప్రమాదాన్ని ఊహించుకుని భయపడటాన్ని 'ఫ్యూచరోఫోబియా' అంటారు. మీ అమ్మని మా  క్లినిక్‌కి పంపు. ట్రీట్ చేసి పంపుతాం..."

మధూహ విసుగ్గా "ప్రతీదానికీ నీకు తెలిసిన రెండు మూడు ఇంగ్లీషు జబ్బుల పేర్లు చెప్పకు" అంది.

అతడు నవ్వి "అసలు మా టెక్నిక్కే అది. రోగి తన రోగలక్షణం ఏదైనా చెప్పగానే అది చాలా సామాన్యమైనదయినా, దానికో ఇంగ్లీషు పేరు పెడతాం. మరో రకంగా చెప్పాలంటే జబ్బుల్ని మేమే  సృష్టిస్తామన్న మాట" అంటూ కాస్త అటూ ఇటూ చూసి, ఆమె వొళ్ళో తలపెట్టుకుని పడుకున్నాడు.
బాగా చీకటిపడటంతో జనం పల్చగా వున్నారు.

"రాజూ- వచ్చేనెల ఒకటో తారీఖుకి నాకో రెండొందలు సర్దగలవా. ఈనెల జీతం రాదు" అంది.

"రెండొందలా? కష్టం అనుకుంటాను. నా సంగతి తెలుసుగా. చాలా కాలిక్యులేటెడ్‌గా వుంటాను? దేని లెక్క దానికి విడదీసి వుంచుకుంటాను".

“ఆర్నెల్ల క్రితం ఇలాగే ఒకసారి అడిగితే, పదిరోజుల ముందు చెప్తే అడ్జెస్టు చేసేవాడిని అన్నావుగా” అంది.

“అన్నాను. నీకు మోరల్ సపోర్ట్ ఇవ్వటానికి! చూడు మధూ- ఎవరి కాళ్ళమీద వాళ్ళు నిలబడాలి. ప్రేమంటే-- తలవాల్చుకోవటానికి భుజం వెతుక్కోవటం కాదు...”

“మరి నా బాధలు నీతో కాకపోతే ఎవరితో చెప్పుకోను?”

“అది ప్రేమ కాదు. స్వార్థం. నా బాధ నీతో ఎప్పుడైనా చెప్పానా?”.

“ఏమో బాబూ, నీ థియరీలు నాకర్థం కావు. నేను చాలా సామాన్యమైన అమ్మాయిని” అంటూ అలసటగా చెట్టుకి ఆనుకుని కళ్ళు మూసుకుంది మధూహ.

2

మరుసటిరోజు..

ప్రొద్దున్న పదింటికి ఆఫీసుకొచ్చిన శాస్త్రికి ఆ రోజు వ్రాయవలసిన ఎడిటోరియల్ పూర్తి చేయటానికి మూడ్ రాలేదు.

సిగరెట్ వెలిగిస్తూ బల్లమీద ఉన్న కాగితాలు చూశాడు. అన్నిటికన్నా పైన - క్రితంరోజు మధూహ ఇచ్చిన స్క్రిప్టు కనపడింది. నిరాసక్తంగా తీసుకుని చదవసాగాడు.

“ఎడిటర్‌గారికి.... ఇది నా మొదటి రచన. నాకు తోచినదేదో వ్రాశాను. మీకు నచ్చిన ప్రచురించగలరు....”

శాస్త్రి ఆ ఉత్తరంమీద అడ్రసు చూశాడు.

అడ్రసు లేదు.

మొత్తం వ్రాతప్రతి అంతా అటూఇటూ తిప్పిచూశాడు. ఎక్కడా అడ్రసు లేదు. అతడికి చాలా కొత్తగా అనిపించింది.

అతడు మొత్తం వ్రాతప్రతి చూశాడు. సంపూర్ణంగా లేదు.

చాలా అందమైన అక్షరాలు..... పొందిగ్గా వున్నాయి. మొదటి పేజీలో కథాంశం (సినాప్సిస్) వుంది.

ఒకమ్మాయికి పెళ్ళయి ఆరేడేళ్ళు కావొస్తున్నా పిల్లలు పుట్టరు. భర్త ఆమెపట్ల నిరాసక్తంగా వుంటాడు. ఆమె మనసులోని దిగులునంతా ఒక డైరీ రూపంలో వ్రాసుకుంటుంది. పిల్లలు పుడితే జీవితానికి ఒక సంపూర్ణత్వం ఏర్పడుతుందని ఒక డాక్టరు దగ్గరకి వెళ్తుంది. పదమూడోరోజు రమ్మంటాడు ఆ డాక్టర్. ఆర్నెల్లపాటు ప్రతిసారీ ఆ తేదీల్లో వెళ్ళినా సంతానం కలుగదు. లోపం భర్తదే అని చెపుతాడు డాక్టరు. కానీ భర్త తనలో ఏలోటూ లేదని నిరూపించుకోవటం కోసం వేరే స్త్రీతో సంబంధం పెట్టుకుంటాడు. ఆమె గర్భవతి అవుతుంది.
భార్య ముందు ఆ విజయాన్ని చూపించి ఆమెని హేళన చేస్తాడు. అదే కల ఆమెకు ప్రతి రాత్రీ వస్తూ వుంటుంది. చివరిరోజు డెలివరి అయినట్టు కూడా వస్తుంది. ఆ మరుసటిరోజు ఆమె ఆత్మహత్య చేసుకుంటుంది.

అదీ కథ.

పేరు 'ది డైరీ ఆఫ్ మిసెస్ లక్ష్మి'

ఎడిటర్ శాస్త్రి నిరాశగా కుర్చీ వెనక్కి వాలాడు. ఈరోజుల్లో ఇంత అబ్‌స్ట్రాక్ట్ సబ్జెక్టు ఎవరు చదువుతారనుకుంటూ వ్రాతప్రతి పక్కన పడేశాడు. అంతలో ఇంటర్‌కమ్ మ్రోగింది. అట్నుంచి పత్రిక ప్రొప్రైటర్.

"ఎడిటోరియల్ ఏం వ్రాస్తున్నారు?" అని అడిగాడు.

"ఫైనల్స్ ఆడనని టెన్నిస్ ప్లేయర్ ప్రహసిత్ ప్రకటన ఇచ్చాడు కదా దాన్ని గురించి వ్రాద్దామనుకుంటున్నాను".

"ఎందుకాడటం లేదట?"

"కారణం తెలీదు"

"మీరు వీలైతే కనుక్కోండి. అతను మీకు తెలుసనుకుంటాను".

"అతని సెక్రటరీతో దూరపు బంధుత్వం వుంది" అంటూ ఆ ఫోన్ పెట్టేసి సెక్రటరీ నెంబర్ వెతకటం కోసం టెలిఫోన్ డైరెక్టరీ తీసుకున్నాడు శాస్త్రి. పత్రికా ఉద్యోగమంటే ఇవన్నీ తప్పవు.

సవ్యసాచిలా అన్నీ చేసుకుంటూ పోవాలి.

ప్రహసిత్ నెంబర్ వెతికి పట్టుకుని, దానికి డయల్ చేయబోతూ వుండగా మళ్ళీ ఇంటర్‌కమ్ మ్రోగింది. ఈసారి అడ్వర్టయిజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌నుంచి.

"నిన్న ఆ రాజు అనే కుర్రాడు ఇచ్చిన ప్రకటనల్లో ఒకటి పొరపాటున మీ దగ్గిర వుండిపోయిందా?".

"ఉంది, ఏం?"

అట్నుంచి అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్ గాఢంగా విశ్వసించి, "చంపేశారు. నిన్నటినుంచీ దానికోసం వెతుకుతున్నాం..." అన్నాడు తేలిగ్గా.

"పొరపాట్లు ఏమన్నా వుంటే చూడమని ఇచ్చాడు...."

"అది మన పని కాదని చెప్పలేకపోయారా?"

"నిన్నటి ప్రకటనలో ... నత్తి, జ్ఞాపకశక్తి పెరుగుతాయని ఇచ్చారు. సరిచేశాను".

"ఏదీ? ఆ మైండ్ హిప్నో మేగ్నో క్లినిక్కేనా? ఈ ప్రకటన కూడా ఆ డాక్టర్‌దే. కాస్త చూసి ఈ వారం వేసెయ్యండి. పార్టీ మావాడే. తప్పులుంటే దిద్దండి".

ఇంటర్‌కమ్ పెట్టేసి శాస్త్రి ఆ ప్రకటన కోసం చూశాడు. కాగితాల అడుగున కనపడింది.

డాక్టర్ విశాల్
సంతానోత్పత్తి కేంద్రం

"మీకు వివాహం జరిగి సంవత్సరం దాటిందా? పిల్లలు పుట్టటం లేదని చింతిస్తున్నారా? మమ్మల్ని సంప్రదించండి. 13, 14, 15 రోజుల్లో డాక్టర్‌గార్ని కలిశేలా స్త్రీలు చూసుకోవలెను. డాక్టర్ విశాల్స్ క్లినిక్ ఫర్ ఫెర్టిలైజేషన్...."

"వీడి తెలుగు శ్రాద్ధం పెట్ట. ఏం తెలుగిది! స్త్రీలు చూసుకోవలెనట?" అని తిట్టుకుంటూ దాన్ని సరిచేయబోయాడు. మరో అనుమానం వచ్చింది.

మొదటిరోజు నుంచి 13వరోజా? అయిదోరోజునుంచి 13 వరోజా?

మనకెందుకొచ్చిందిలే అనుకుంటూ? - "డాక్టర్‌గారిని కలిసేలా స్త్రీలు చూసుకోవలెను" అన్నది కొట్టేసి, "డాక్టర్ గారిని కలవవలెను" అని సరిదిద్దాడు.

తరువాత బోయ్‌ని పిల్చి ఆ ప్రకటన ప్రచురణకి ఇచ్చేసి ఎడిటోరియల్ వ్రాయబోయాడు.

రాయబుద్ధి కాలేదు.

ప్రహసిత్ ఎందుకు టెన్నిస్ నుంచి విరమించుకోవాలనుకుంటున్నాడో కారణం కూడా వ్రాస్తేనే అది సెన్సేషన్ అవుతుంది.

అతడికి మధూహ గుర్తొచ్చింది. ఇటువంటి విషయాల్లో ఆమె వుంటే ఏదోలా అసలు విషయం రాబడుతుంది.

పూర్తి చేయవలసిన ఎడిటోరియల్ పక్కన పెట్టి కుర్చీ వెనక్కి వాలాడు.

ఏ పని చేయాలో తోచలేదు.  టేబిల్ మీద స్క్రిప్టు కనపడింది.  దాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు. మధూహ ఇచ్చిన స్క్రిప్టు అది. సాధారణంగా ఎడిటర్లు మొదటి పేజీ చదవగానే అందులో శైలీ శిల్పమూ చూసి, మిగతాది చదవటం టైమ్ వేస్టా కాదా అని తెలుసుకుంటారు.

సినాప్సిస్ చదవగానే ఇది పాఠకులకు నచ్చదు అని తెలిసిపోయింది. బావుండటం వేరు, పాఠకులకు నచ్చటం వేరు. ముఖ్యంగా సెక్సూ వయొలెన్సూ రాజ్యమేలుతున్న ఈ రోజుల్లో...

కానీ మధూహ అంతగా ఎందుకు చెప్పింది అన్న ఉత్సుకతతో మొదటి పేజీ చదవటం ప్రారంభించాడు.

"కొండల వెనుక నేను పారేసుకున్న జ్ఞాపకాల మూటని భుజాన వేసుకుని, ప్రతిరాత్రి నన్ను బాధపెట్టటానికి లోయల్లోంచి చంద్రుడు బయటకొస్తాడు.

నీ జ్ఞాపకాల వీధుల్లో నా మనసు పచార్లు చేస్తూ వుంటుంది.

నా పాదం రోదిస్తూనే వుంటుంది. రుధిరం స్రవిస్తూనే వుంటుంది. నీ మజిలీ మాత్రం కనపడదు."

మొదటి వాక్యానికే ఉలిక్కిపడి ముందుకు వంగి, తిరిగి చదవటం ప్రారంభించాడు.

"నేను నాదాన్ని

నన్ను మీటు, నీకు అనురాగాన్ని ఇస్తాను.

నేను స్వేదాన్ని

నన్ను గుర్తించు నీకు సేవలందిస్తాను.

నేను వేదాన్ని

నన్ను చదువు. నీకు పరిపూర్ణత్వాన్నిస్తాను"

వణికే చేతివేళ్ళతో సిగరెట్ తీసుకుని వెలిగించాడు.

ఏమిటిది? కవిత్వమా? హృదయమా?

అతడి కంటిచూపు అక్షరాల వెంట  పరుగెడుతోంది.

"నీకు తెలుసా? అర్థరాత్రి సముద్రం మాట్లాడుతుందని? ఆ సాగరఘోషలో నా హృదయం నాకు కనపడుతుంది. నాలాగే సముద్రం కూడా ఒంటరిది. ఆకాశంలా నువ్వు దూరంగా వున్నంతసేపూ.

గంట పట్టిందతడికి చదవటం పూర్తి చేయటానికి. ఆ తరువాత స్తబ్దుగా అలాగే వుండిపోయాడు. తలుపు చప్పుడయ్యేవరకూ ఈ ప్రపంచంలోనే లేడు.

స్టఫ్ ఆర్టిస్ట్ లోపలికి వచ్చాడు. ఆ రోజు ప్రింటింగ్‌కి వెళ్ళాల్సిన పేజి తయారుచేసి తీసుకొచ్చాడు. "ఎడిటోరియల్ ఇస్తారా సార్" అని అడిగాడు.

"వ్రాయలేదు" అన్నాడు శాస్త్రి.

"అది అవసరం లేదు కానీ, ఆ ఖాళీ స్థలంలో కొత్త సీరియల్ ప్రకటన వెయ్యి . వచ్చే వారమే ప్రారంభం అని పెద్ద అక్షరాల్తో ప్రకటించు"

ఆర్టిస్టు ఆశ్చర్యాన్ని అణుచుకుంటూ "టైటిల్ ఏమిటి సార్" అని అడిగాడు.

"ది డైరీ ఆఫ్ మిసెస్ లక్ష్మి"

శాస్త్రికి నచ్చలేదు. లక్ష్మి అనే రచయిత్రి నవల వ్రాస్తూ దానికి ఆపేరే పెడ్తే బాగోదు. అదీ గాక అలాంటి పేరు మీదే ఇంకో నవల ఇదివరకే వచ్చింది.

సినాప్సిస్ చూశాడు.